
సాక్షి ఖమ్మం

బుధవారం । 14 । జూన్ । 2023



రంగంలోకి సీబీసీఐడీ

డీసీసీబీలో తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పలువురు రుణాలు తీసుకోగా నమోదైన కేసులపై సీబీసీఐడీ దృష్టి సారించింది. 8లో



ముక్కలు చెక్కలై..

తెలంగాణ అంతటా ఆవిర్భావ సంబరాలు జరుగుతుండగా, ముక్కలు, చెక్కలైన భద్రాద్రిలో మాత్రం నిర్లిప్తత అలుముకుంది. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 30°

వాతావరణం

బుధవారం జిల్లా అంతటా గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే వడగాలుల ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

24 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు స్లాట్ బుక్ చేసుకున్న 53మందిలో 31 మంది హాజరయ్యారు. వీరిని వైద్యులు పరీక్షించి 24 మంది సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

ఇది ఇరిగేషన్ భూమి !



అధికారులు ఏర్పాటుచేయించిన హద్దురాళ్లు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో పలుచోట్ల అనుమతి లేకుండా ఏర్పాటవుతున్న వెంచర్లపై జల వనరుల శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇటీవల నేలకొండపల్లి సబ్ డివిజన్ పరిధిలో వెంచర్ల నిర్వాహకులు పంట కాల్వలను ఆక్రమించినట్లు ఫిర్యాదులు అందగా, ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు సూచనలతో హద్దుల ఏర్పాటుకు సిబ్బంది రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా రహదారికి ఆరు మీటర్ల దూరం వరకు శాఖ భూములను గుర్తించి హద్దురాళ్లు పాతారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ పంట కాల్వల భూములను ఆక్రమిస్తే పోలీసు కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

నేటి నుండి పాలిసెట్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు బుధవారం నుంచి కౌన్సెలింగ్ మొదలుకానుంది. ఈనెల 14 నుండి 18 వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉండగా, 16 నుండి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 16 నుండి 21వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదుకు అవకాశం ఉంటుందని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్న వారికి 25 నుండి ప్రొవిజినల్ సీట్ల అలాట్‌మెంట్, 25 నుండి 29వ తేదీ వరకు సీట్లు కేటాయించనుండగా, ఫీజు చెల్లించాలని సూచించారు. ఇక చివరి విడత కౌన్సెలింగ్ జూలై 1వ తేదీన, స్పాట్ అడ్మిషన్లు జూలై 7 నుండి 17 వరకు ఉంటాయని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లాలో మధిర, కొత్తగూడెం, మణుగూరుల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా 720 సీట్లు, తొమ్మిది ప్రైవేట్ కళాశాలల్లో 1,980 సీట్లు ఉన్నాయని వెల్లడించారు.

షాదీఖానా నిర్మాణాన్ని అడ్డుకున్న అటవీ అధికారులు

కల్లూరు: కల్లూరులోని జామియా మసీదు వెనుక స్థలాన్ని రెవెన్యూ అధికారులు షాదీఖానా నిర్మాణానికి కేటాయించారు. ఈమేరకు రూ.75 లక్షలు మంజూరు కావడంతో ముస్లింలు సోమవారం నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఈ విషయం తెలియడంతో అటవీ శాఖ అధికారులు మంగళవారం పనులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలెక్టర్‌తో సంప్రదించాకే షాదీఖానాకు స్థలాన్ని కేటాయించారని ముస్లింలు వెల్లడించారు. అయితే, స్థలం అటవీ శాఖ పరిధిలోనే ఉందని, షాదీఖానాకు కేటాయించినట్లు తమకు ఆదేశాలు రాలేదని తల్లాడ రేంజ్ అధికారి అరవింద్, డీఆర్‌ఓలు నాగమణి, కే.వీ.రామారావు, శ్రీనివాసరావు చెప్పడంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయమై తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌ను వివరణ కోరగా, జామియా మసీదు సమీపాన ఏడు కుంటల స్థలాన్ని అటవీశాఖదిగా గుర్తించి ఆపక్కనే ఉన్న గ్రామకంఠాన్ని షాదీఖానాకు కేటాయించామని తెలిపారు.



పెద్దాస్పత్రిలోని క్యాథల్యాబ్ మిషన్

సిద్ధంగా మెడికల్ కళాశాల..



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా రాష్ట్రప్రభుత్వం గత ఏడాది మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ప్రభుత్వం రూ.166 కోట్లు మంజూరు చేయడంతో పాటు పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ, ఖమ్మం జనరల్ ఆస్పత్రి సహా 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుతం ఆయా భవనాల్లో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. కళాశాలకు ఎన్ఎంసీ అనుమతి కూడా రావడంతో ఈ ఏడాది నుంచే 100 సీట్లు భర్తీ చేసి బోధన ప్రారంభించనున్నారు. ఇక ఇప్పటికే ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 26 మంది సీనియర్ రెసిడెంటల్ వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రారంభమైతే జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఆరోగ్యం.. బలోపేతం!

జిల్లాకు మెడికల్ కళాశాలతో కొత్త హంగులు

- పల్లె, పట్టణ దవాఖానాలతో మెరుగైన వైద్య సేవలు
- పెద్దాస్పత్రిలో అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు
- 'దశాబ్ది' ఉత్సవాల్లో భాగంగా నేడు ఆరోగ్య దినోత్సవం
- మొదలుకానున్న కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

ఖమ్మం వైద్యవిభాగం: తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాలో ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. భారీగా నిధులు కేటాయిస్తుండటంతో ప్రభుత్వ వైద్యశాలల ద్వారా వైద్యపరంగా సేవలు మెరుగయ్యాయి. పల్లె, పట్టణ దవాఖానాలతో పాటు జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా మంజూరైంది. దశాబ్దం క్రితం జిల్లాలో ప్రభుత్వ వైద్యం అంతంత మాత్రంగానే ఉండగా.. అప్పట్లో జిల్లా ఆస్పత్రిలో 250 పడకలే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆస్పత్రి స్థాయి 550 పడకలకు చేరగా, జిల్లాలో 26 పీహెచ్‌సీలు, ఆరు సీహెచ్‌సీల ద్వారా నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇక జిల్లా కేంద్రంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, మహిళా ఆరోగ్య కార్యక్రమం ద్వారా ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యాన జిల్లాలో వైద్యసదుపాయాలపై కథనం.

పెద్దాస్పత్రిలో ఆధునిక వైద్యసేవలు

జిల్లా కేంద్రంలోని జనరల్‌ఆస్పత్రిలో కొన్నాళ్లుగా వైద్యసేవలు మెరుగవుతున్నాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, కంటి, చర్మ, దంత, ట్రామా కేర్ వంటి సేవలతో పాటు ఇటీవల కార్డియో, నెఫ్రాలజీ, యూరాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో హైదరాబాద్, విజయవాడ వెళ్లాల్సిన పని లేకుండా జిల్లా వాసులు ఉచితంగా వైద్యం పొందే అవకాశం కలిగింది. వీటికి తోడు డయాలసిస్, ఆరోగ్యశ్రీ, మోకీలు శస్త్రచికిత్సలు, పాలియేటివ్ సేవలు కూడా అందిస్తున్నారు. అంతే కాకుండా రూ.7కోట్ల వ్యయంతో క్యాథల్యాబ్ యంత్రాన్ని సమకూర్చగా గుండెకు సంబంధించి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇవేకాక రేడియాలజీ, సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, టిఫా మిషన్లు కేటాయించడమే కాక తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా 57 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ హబ్‌లో ఇప్పటివరకు 6,86,916 టెస్టులు నిర్వహించడం విశేషం.

ప్రసవాల్లో మేటి.. ఎంసీహెచ్

పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రసవాల్లో మేటిగా నిలుస్తోంది. గతంలో జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేవి. ప్రభుత్వం 2017 జూన్‌లో కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టాక పరిస్థితి మారిపోయింది. అప్పటి నుండి ప్రసవాల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ రెట్టింపు స్థాయికి చేరింది. గతంలో 30 శాతం మాత్రమే జరిగే ప్రసవాలు ఇప్పుడు ప్రస్తుతం 70 శాతానికి చేరాయి. కేసీఆర్ కిట్ పథకం ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 55,187 ప్రసవాలు జరగగా 48,196 కేసీఆర్ కిట్లు అందజేశారు. ఇందులో 90 శాతం ప్రసవాలు ఎంసీహెచ్‌లో జరగటం విశేషం. ఇక ఎంసీహెచ్‌లో ఇప్పటి వరకు 46,379 ప్రసవాలు జరగగా, 41,227 కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు.

నేటి నుంచి న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీని జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభిస్తారు. గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించి, పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ఈ కిట్లు ఇవ్వనుండగా, జిల్లాలో ఇప్పటికే 7,563 మంది గర్భిణులను అర్హులుగా గుర్తించారు. అలాగే, జిల్లాలో పనిచేస్తున్న 1,348 ఆశ కార్యకర్తలకు యూనిఫామ్స్, ఏఎన్ఎంలకు బీపీ ఆపరేటర్లు పంపిణీ కూడా మొదలవుతుంది. అంతేకాక నియోజకవర్గాల పరిధిలో ఉత్తమ ఆశ, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ ఆఫీసర్లను సన్మానించనున్నారు.

జనాభా ప్రాతిపదికన దవాఖానాలు

ప్రతీ ఐదు వేల జనాభాకు ఒక పల్లె దవాఖానా, పది వేల జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం పట్టణ దవాఖానాలు ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో 224 సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చాలని నిర్ణయించగా, ఇప్పటికే 161 సబ్ సెంటర్లు అప్‌గ్రేడ్ అయ్యాయి. వీటిలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించి వైద్యసేవలు ప్రారంభించడంతో పీహెచ్‌సీలకు సుదూరంగా ఉండే పల్లెల వాసులకు వైద్యం అందుతోంది. అంతేకాకుండా పట్టణ దవాఖానాలు తొమ్మిదింటిని ప్రారంభించారు. ఖమ్మంలో పాండురంగాపురం, మేదరిబజార్, వైఎస్ఆర్.నగర్, కొత్తగూడెం, రంగనాయకులగుట్ట, రామన్నపేట, ఓల్డ్ మున్సిపాలిటీ ఏరియాతో పాటు సత్తుపల్లి, మధిరలో ఒక్కో పట్టణ దవాఖానా అందుబాటులోకి వచ్చింది.



కొత్తగూడెంలోని బస్తీ దవాఖానా

సభకు సన్నద్ధం..



ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ మైదానంలో సభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

- రేపు ఖమ్మంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ
- ఏర్పాట్లలో నిమగ్నమైన బీజేపీ రాష్ట్ర నాయకత్వం
- జన సమీకరణపై ప్రత్యేక దృష్టి



సభకు రావాలని బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న మహిళా నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ గ్రౌండ్‌లో గురువారం జరగనున్న బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొననుండగా.. ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. బీజేపీ ఆధ్వర్యాన జరిగే ఈ సభకు కేంద్ర హోం మంత్రి హాజరుకానుండడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వశక్తులు ఒడ్డుతున్నారు. సభను విజయవంతం చేయడం ద్వారా జిల్లాలో బీజేపీ సత్తా చాటడమే కాక కేంద్ర పెద్దల దృష్టిని కూడా ఆకర్షించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఇక కేంద్ర హోంమంత్రి పాల్గొనే సభ కావడంతో భద్రత ఏర్పాట్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లా పోలీసులు మైదానాన్ని పరిశీలించగా, బుధవారం ప్రత్యేక పోలీసు బలగాలు ఖమ్మం చేరుకోనున్నాయి.

నాలుగు రోజులుగా ఏర్పాట్లపై దృష్టి

హోంమంత్రి అమిత్‌షా హాజరయ్యే సభను విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకత్వం నాలుగు రోజులుగా శ్రమిస్తోంది. గత శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖమ్మంకు వచ్చి సభాస్థలిని ఎంపిక చేశారు. అప్పటి నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం ఇక్కడే ఉంటూ ఏర్పాట్లలో నిమగ్నమైంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్ తదితరులు పోలీసు అధికారులతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. మంగళవారం సాయంత్రానికి సభావేదిక నిర్మాణం ఓ కొలిక్కి వచ్చింది. మరోపక్క పార్కింగ్‌తో పాటు సభాస్థలిలో ఏర్పాట్లపై అంశాలను ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్, ట్రెయినీ ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్, సీఐ అంజలి పరిశీలించి సూచనలు చేశారు.

ముస్తాబవుతున్న ఖమ్మం

ఖమ్మంకు తొలిసారిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానుండడంతో బీజేపీ నాయకులు సభాస్థలితో పాటు నగరమంతటా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటుచేస్తున్నారు. బీజేపీ ఆధ్వర్యాన జాతీయ నాయకులు పాల్గొనే సభ కావడంతో సక్సెస్ చేసేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఖమ్మంలో గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయ్ సభ నిర్వహించగా.. ఆ తర్వాత స్థాయిలో జరుగుతున్న సభ ఇదే కావడంతో కేడర్ మొత్తం ఉత్సాహంగా పనిచేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రచారం

సభను విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కేడర్‌తో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ జన సమీకరణపై సూచనలు చేస్తున్నారు. ఖమ్మం టూటౌన్, బీజేపీ జిల్లా కార్యాలయంతో పాటు ఓబీసీ మోర్చా ఆధ్వర్యాన వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. అలాగే పెనుబల్లి, ఎర్రుపాలెంతో పాటు పలు ప్రాంతాల్లో కార్యకర్తలతో సమావేశమై లక్ష్యాలను నిర్దేశించారు. ఇల్లెందులో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ పర్యటించారు.

జన సమీకరణకు కమిటీలు

హోం మంత్రి షా హాజరయ్యే సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేయాలన్న లక్ష్యంతో బీజేపీ నేతలంతా దృష్టి సారించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి నేతలకు లక్ష్యాలను నిర్దేశించి ఆ మేరకు పనిచేసేలా సూచనలు చేశారు. ప్రధానంగా జిల్లా కేంద్రం నుంచి 10 వేల మందిని తరలించేలా లక్ష్యాన్ని ఎంచుకున్నారు. ఇందుకోసం 50 మందికి ఒకరు చొప్పున కోఆర్డినేటర్‌ను నియమించారు. నాయా కోఆర్డినేటర్లు బీజేపీ కార్యకర్తలు, వారి కుటుంబీకులు, అభిమానులను కలిసి సభకు వచ్చేలా కృషి చేస్తారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చే వారి కోసం ఇప్పటికే వాహనాలు సిద్ధం చేసి నియోజకవర్గ నేతలకు బాధ్యతలు అప్పగించారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కొత్వాల్, పక్కన దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒబేదుల్లా కొత్వాల్ సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని పటిష్టం చేసేందుకు బూత్ స్థాయి నుంచి మండల స్థాయి కమిటీలు నియమించాలని తెలిపారు. అలాగే, వచ్చే నెల 2న జరగనున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకుడు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి ఇరవై వేల మంది పాల్గొనేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం వివిధ నియోజకవర్గాల నాయకులతో సమావేశమై సూచనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు రాంరెడ్డి గోపాలరెడ్డి, రాయల నాగేశ్వరావు, మాలోత్ రాందాస్‌నాయక్, పుచ్చకాయల వీరభద్రం, బైరెడ్డి మనోహర్‌రెడ్డి, శీలం ప్రతాప్‌రెడ్డి, శౌరి, సున్నం నాగమణి, నాగండ్ల దీపక్‌చౌదరి, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్, మొక్కా శేఖర్‌గౌడ్, బొందయ్య, హుస్సేన్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బయోమెట్రిక్‌తో రిజిస్ట్రేషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే స్టాంపుల విక్రయాన్ని ఆన్‌లైన్‌లో అమలుచేస్తుండగా, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ అధీకృత అధికారి అనుమతి లేకుండా జరగొద్దనే భావనతో నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ప్రారంభించాలంటే సబ్ రిజిస్ట్రార్ బయోమెట్రిక్‌లో వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. జిల్లాలోని జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. తద్వారా సబ్ రిజిస్ట్రార్ లేకుండా సిబ్బంది రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించే అవకాశం ఉండదు.

మృగశిరలోనూ మండుతున్న ఎండలు



ఖమ్మంవ్యవసాయం: మృగశిర వచ్చిందంటే సాధారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఎండలు తగ్గుముఖం పడతాయి. కానీ ఈసారి రోహిణి కార్తెకు దీటుగా మృగశిరలోనూ ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో సోమవారంతో పోలిస్తే మంగళవారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. మంగళవారం ముదిగొండ మండలం పమ్మిలో అత్యధికంగా 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, నేలకొండపల్లిలో 44.2, బాణాపురంలో 44.1, ఖానాపురంలో 43.9, పల్లెగూడెంలో 43.6, ముదిగొండ, సత్తుపల్లిలో 43.4, గంగారంలో 43.2, చింతకానిలో 43.1, వేంసూరులో 42.7, తిరుమలాయపాలెంలో 42.6, రావినూతల, కాకరవాయిలో 42.5, పెద్దగోపతి, లింగాలలో 42.4, ప్రకాష్‌నగర్, రఘునాథపాలెంలో 42.3, సిరిపురం, మధిర, గేటు కారేపల్లిల్లో 42.2, పెనుబల్లి, ఎర్రుపాలెం, కూసుమంచిల్లో 42.1, నాగులవంచ, పంగిడిల్లో 42.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలకు తోడు వడగాలులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాకలో ఆలస్యంతోనే మృగశిర కార్తెలో సైతం ఎండ నమోదవుతోందని చెబుతున్నారు.

మహిళా సాధికారత దిశగా కృషి

- నిర్ణయాత్మక పదవుల్లో మహిళలు ఉండాలి
- మహిళా సంక్షేమ దినోత్సవంలో కలెక్టర్ గౌతమ్



స్వయం సహాయక బృందానికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన మేయర్ నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, డీఆర్డీఓ విద్యాచందన తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: మహిళా సాధికారత సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మహిళా సంక్షేమ దినోత్సవ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లను టీచర్లుగా పిలవడమే కాక వేతనాన్ని 300 శాతం పెంచారని తెలిపారు. కేఎంసీలో 36 మంది మహిళా కార్పొరేటర్లు ఉన్నారని.. అంతేకాకుండా నిర్ణయాత్మక పదవుల్లో మహిళలు ఉంటే మహిళల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడం సాధ్యమవుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు.

ఎన్నో సంక్షేమ పథకాలు

జిల్లాలో 70 వేల మందికి పైగా వితంతువులు, ఒంటరి మహిళలకు, ఆసరా పెన్షన్లు అందుతున్నాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే, కల్యాణలక్ష్మి ద్వారా బాల్య వివాహలకు అడ్డుకట్ట పడిందని, జిల్లాలోని 45 గురుకులాల్లో 19,113 మంది బాలికలు చదువుకుంటున్నారని చెప్పారు. ఇక గర్భిణుల కోసం కేసీఆర్ న్యూట్రీషన్, ప్రసవించాక కేసీఆర్ కిట్ అందుతోందని తెలిపారు. అనంతరం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పి.నీరజ మాట్లాడగా పలు మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖకు చెందిన చేయూత వాహనాన్ని ప్రారంభించడంతో పాటు మహిళా సంఘాల ఉత్పత్తుల్లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అలాగే, ఉత్తమ సేవలందించిన మహిళలను సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, మహిళా ఉద్యోగులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, రఘునాథపాలెం ఎంపీపీ గౌరి, జిల్లా సంక్షేమాధికారి జి.జ్యోతి, డీఆర్డీఓ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10వ డివిజన్‌లోని పర్ణశాల వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య దినోత్సవం లో పాల్గొని కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రామోజీ రమేష్


రామోజీ రమేష్‌కు బ్యాడ్జి పెడుతున్న డీజీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న రామోజీ రమేష్‌కు ఇటీవల ఏఎస్పీగా పదోన్నతి లభించింది. ఇందులో భాగంగా మంగళవారం ఆయన ఇక్కడ రిలీవ్ అయి హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా రామోజీ రమేష్‌కు డీజీపీ అంజనీకుమార్ బ్యాడ్జీ అందజేశారు.

హోంగార్డ్ ఆర్‌ఐని కలిసిన సంఘం నేతలు


ఆర్‌ఐకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఖమ్మంక్రైం: జిల్లా హోంగార్డ్ ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన కె.సాంబశివరావును జిల్లా హోంగార్డు ఆఫీసర్ల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హోంగార్డ్‌ల సమస్యలను వివరించగా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్‌ఐ తెలిపారు. ఆర్‌ఎస్సై ఎస్.కే.నాగుల్‌మీరా, హోంగార్డ్ ఆఫీసర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీతో పాటు బంకా శ్రీను, ఈ.వెంకటేశ్వర్లు, జి.నీరజ, ఎం.డీ.ఖాదర్, ఎస్.శ్రీనివాసరావు, జి.వెంకన్న, డి.రమేష్, డి.రవిబాబు, డి.రామకృష్ణ, జె.గురుమూర్తి పాల్గొన్నారు.

గ్రానైట్ వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: జిల్లాలోని కామేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన గ్రానైట్ వ్యాపారి రూ.19.50 లక్షలకు గాను మంగళవారం దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. ఆయన ఖమ్మంలో పలు రకాల గ్రానైట్ కొనుగోలు చేసి వివిధ పట్టణాల్లో విక్రయించేవాడు. ఈక్రమంలో చేసిన అప్పులుపెరగగా,16 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో తన న్యాయవాది ద్వారా ఐపీ పిటిషన్ దాఖలు చేశాడు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు

కొణిజర్ల: అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి అదే వేగంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొణిజర్లలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు... కొణిజర్లకు చెందిన కిన్నెర రాజేష్ బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ బస్వాపురం క్రాస్ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న కారు అతి వేగంగా ఢీకొట్టింది. అదే వేగంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో రాజేష్ రెండు చేతులు విరిగి తీవ్రంగా గాయపడగా, బెలూన్లు తెరుచుకుకోవడంతో కారులో ఉన్న వారికి గాయాలు కాలేదు. ఈ సమయాన పెద్ద శబ్దం రావడంతో చేరుకున్న స్థానికులు యువకుడిని ఖమ్మం తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,725	1,400
పెసలు	7,350	6,500
మిర్చి	20,700	12,500
ఏసీ మిర్చి	24,400	18,500
తాలు మిర్చి	13,000	8,000
పత్తి	6,900	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

ముక్కలు చెక్కలై..


భద్రాచలం పట్టణ వ్యూ

'దశాబ్ది'లో దిశా నిర్దేశం కరువైన భద్రాచలం

- అభివృద్ధి, వరాల మూటలు మాటలకే పరిమితం
- అతిపెద్ద ఏజెన్సీ చిన్నబోయిన వైనం
- ఐదు పంచాయతీలను తిరిగి కలపాలని స్థానికుల డిమాండ్

భద్రాచలం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ దశాబ్ద కాలంలో రాష్ట్రమంతా అభివృద్ధిలో పరుగులు పెడుతున్నా, భద్రాచలం ఏజెన్సీ మాత్రం దిశా నిర్దేశం, అభివృద్ధి లేక నిస్తేజంగా మారింది. రాష్ట్ర, జిల్లాల విభజనలో ముక్కలుగా చీలిపోయిన భద్రాచలం ఏకాకిగా మిగిలింది. పలు ముఖ్యమైన కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడంతో దిక్కూ మొ క్కూ లేకుండా ఉండిపోయింది. భద్రాచలం అంటే శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికే పరిమితమైన ఖ్యాతిని కూడగట్టుకుంది. రాష్ట్రం మొత్తం దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్న తరుణంలో భద్రాచలానికి జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

మండల పరిషత్ పోయె..
పాలక మండలి లేదాయె..

మండలాల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కృషి చేసే మండల పరిషత్ సైతం భద్రాచలంలో లేకపోవడం శోచనీయం. ఈ మండలంలో గ్రామాలు లేకపోవడంతో మండల పరిషత్, జెడ్పీటీసీ హోదాలను రద్దు చేశారు. దీంతో ఇక్కడున్న మండల పరిషత్ కార్యాలయాన్ని నూతనంగా ఏర్పడిన ఆళ్లపల్లి మండలానికి తరలించారు. 80 వేలకు పైగా జనాభా ఉన్న భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీలో పాలకవర్గం లేక ఐదేళ్లు కావస్తోంది. 2018 ఆగస్టులో గ్రామ పంచాయతీ పాలకవర్గం ముగిసినా, ఇప్పటి వరకు మళ్లీ ఎన్నికలు జరగలేదు. భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ప్రకటించడం, దీనిపై గిరిజన సంఘాలు హైకోర్టుకు వెళ్లడం, ఆ తర్వాత భద్రాచలంను మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడమే కాక అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపారు. అయితే రాష్ట్ర, జిల్లా విభజనతో ఇప్పటికే భద్రాచలం నష్టపోయిందని, మళ్లీ పంచాయతీల విభజనతో మరింత నష్టపర్చవద్దని ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో స్థానికులు గవర్నర్ తమిళి సైకి విన్నవించారు. దీంతో ఆ బిల్లును గవర్నర్ ఆమోదించకుండా తిప్పి పంపారు. ఇలా అనేక పరిణామాలతో భద్రాచలం గ్రామపంచాయతీ ఐదేళ్లుగా పాలకవర్గం లేకుండానే సాగుతోంది. ఇక గతంలో భద్రాచలం డివిజన్‌లో కొనసాగిన అనేక విద్యాలయాలు, కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోవడంతో పట్టణం కళ తప్పింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా భద్రాచలానికి ఇస్తామన్న రూ.100 కోట్లలో ఒక్క పైసా విడుదల చేయకపోవడంతో ఈ దశాబ్దిలో ఏమాత్రం అభివృద్ధి చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అతిపెద్ద ఏజెన్సీ చిన్నబోయింది..

తెలంగాణ ఆవిర్భావంతో భద్రాచలం ఏజెన్సీ ప్రాభవానికి గండి పడింది. రాష్ట్ర విభజనతో భద్రాచలం డివిజన్‌లో ఉన్న కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, భద్రాచలం పట్టణం మినహా ఇతర గ్రామాలు ఏపీలో విలీనం అయ్యాయి. దీంతో రాష్ట్రంలోనే అతి పెద్దదైన భద్రాచలం ఏజెన్సీ చిన్నదైంది. భద్రాచలం మండలంలోని యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, కన్నాయిగూడెం, పిచుకలపాడు గ్రామపంచాయతీలను సైతం ఆంధ్రప్రదేశ్‌లో కలపడంతో పట్టణానికే పరిమితమై మండల పరిధి కుచించుకుపోయింది. ఇక జిల్లాల పునర్విభజనతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపారు. రాష్ట్ర విభజనకు ముందు ఎనిమిది మండలాలతో వర్ధిల్లిన భద్రాచలం ప్రస్తుతం మూడు మండలాలకే పరిమితమైంది.

ఆ ఐదు పంచాయతీలను కలపాలి..

ప్రజాభీష్టం లేకుండా ఏకపక్షంగా ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భౌగోళికంగా భద్రాచలంతో ఆ ప్రాంతాలకు ఉన్న అనుబంధంతో తమను ఇక్కడే కొనసాగించాలని ఆయా గ్రామాల వారు పలుమార్లు బంద్‌లు, రాస్తారోకోలు చేశారు. వీరి ఉద్యమానికి బీఆర్‌ఎస్ మినహా స్థానిక రాజకీయ పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. ఇటీవల భద్రాచలం వచ్చిన గవర్నర్ తమిళి సైకి సైతం ఆయా గ్రామాల వారు తమ సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఇక కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లేందుకు వారు సిద్ధమవుతున్నారు.

ముస్తాబైన మధిర రూరల్ ఠాణా

- త్వరలో ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు
- ఖాజీపురం సమీపాన నిర్మాణం


ప్రారంభానికి ముస్తాబవుతున్న మధిర రూరల్ పోలీస్‌స్టేషన్

మధిర: మధిర మండలం ఖాజీపురం సమీపాన అన్ని హంగులతో నిర్మించిన మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. విశాలమైన పార్కింగ్, చుట్టూ ఫెన్సింగ్, స్టేషన్‌కు బాధితులకు సాంత్వన కలిగించేలా సౌకర్యాలు, సిబ్బందికి విశ్రాంతి గది ఇలా అన్ని వసతులతో స్టేషన్ భవనం నిర్మించారు. త్వరలోనే భవనాన్ని ప్రారంభించనుండగా, మిగిలిన చిన్నచిన్న పనులు పూర్తిచేస్తున్నారు.

సీఐ ప్రత్యేక చొరవతో...

మధిర సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఒడ్డేపల్లి మురళి పోలీసుస్టేషన్లలో సిబ్బందికి అన్ని సౌకర్యాలు సమకూరేలా ప్రత్యేక దృష్టి సారిస్తారు. అలాగే, స్టేషన్ భవనాల ఆధునికీకరణ, భవనాల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తారు. ఈ నేపథ్యాన కూసుమంచిలో పనిచేసినప్పుడు సీఐ ఆఫీస్ ఆవరణలో విశ్రాంతి గది, పార్కింగ్ షెడ్డు నిర్మించిన ఆయన, నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లోనూ సిబ్బంది కోసం విశ్రాంతి గది నిర్మాణం చేపట్టారు. ఇక మధిర సీఐగా వచ్చాక సర్కిల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. రెండు నెలల్లోనే నిర్మాణాన్ని పూర్తిచేసి మంచి గార్డెనింగ్‌తో ఆహ్లాదకర వాతావరణం తీసుకొచ్చారు. ఈ సర్కిల్ పరిధిలోని ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రహరీ, గార్డెనింగ్, పార్కింగ్ కు షెడ్డు నిర్మించారు. స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేపట్టారు. బోనకల్‌లోనూ పార్కింగ్‌కు రేకుల షెడ్డు నిర్మించారు. ఇంకా మధిర టౌన్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ మరమ్మతులు, క్వార్టర్స్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలానికి ఫెన్సింగ్ వేయించారు.

శిథిలావస్థకు 'రూరల్' భవనం

గతంలో మధిర రూరల్ పోలీస్ స్టేషన్ కొనసాగిన భవనం కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో తాత్కాలికంగా సుందరయ్యనగర్‌లో ఉన్న పాతపాఠశాల భవనాన్ని వినియోగిస్తున్నారు. విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకుని పాఠశాల భవనానికి కూడా మరమ్మతులు చేయించారు. నూతనంగా పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించేంతవరకు సిబ్బందికి, పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఖాజీపురం సమీపాన స్థలం కేటాయించారు.

ప్రభుత్వ నిధులు, దాతల చేయూత

ఖాజీపురంలో పోలీసుస్టేషన్‌కు కేటాయించిన స్థలంలో భారీగా క్వారీలు గుంతలు ఉన్నాయి. సుమారు రెండు వేల ట్రక్కుల మట్టితో ఈ గుంతలను పూడ్పించాక పోలీస్ కమిషనర్, అడిషనల్ పోలీస్ కమిషనర్, వైరా ఏసీపీ తదితర ఉన్నతాధికారుల సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.12 లక్షలు మంజూరు చేయించారు. ఇంకా సుమారు రూ.15లక్షలకు పైగా విలువ చేసే సామగ్రిని దాతల నుంచి సేకరించారు. ఎవరి నుంచి రూపాయి నగదు తీసుకోకుండా కేవలం సామాగ్రి తీసుకోవాలని నిర్ణయించడంతో వ్యాపారులు, ఇతర దాతలు సహకరించడం విశేషం. ఇవేకాక విధినిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరున్న సీఐ మురళి... నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, నేరస్తులకు శిక్ష పడేలా సాక్షాలు సేకరించడంలోనూ ప్రత్యేకత కనబరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



విధి నిర్వహణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తూ ప్రజలు, దాతల సహకారంతో పోలీసుస్టేషన్ భవనం, పార్కింగ్ షెడ్లు నిర్మించాం. దాతలను కలిసి భవనాలకు కావాల్సిన మెటీరియల్ నేరుగా సేకరించాం. ఉద్యోగులకు బదిలీలు జరిగినా కార్యాలయాలు మాత్రం శాశ్వతంగా ఉంటాయి. ఎవరు విధులు నిర్వర్తించినా ఇబ్బంది ఉండొద్దనే భావనతో పోలీసుస్టేషన్‌ను నిర్మించాం.

– ఒడ్డేపల్లి మురళి, సీఐ, మధిర

వృద్ధులు, దివ్యాంగుల కోసం 'చేయూత'

ఖమ్మంగాంధీచౌక్: ఆపదలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'చేయూత' వాహనాన్ని తీసుకువచ్చింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కలిపి ఒక వాహనాన్ని కేటాయించగా, ఆపదలో ఉన్న వారు 155326 నంబర్‌కు ఫోన్ చేస్తే వాహనంలో సిబ్బంది వచ్చి సహకరిస్తారు. జిల్లా సంక్షేమశాఖ ఈ వాహనం నిర్వహణ బాధ్యతలు చూసుకోనుండగా పర్యవేక్షణకు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమించారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన మహిళా సంక్షేమం దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వీ.పీ. గౌతమ్ చేయూత వాహనాన్ని ప్రారంభించారు.



జిల్లాకు కేటాయించిన చేయూత వాహనం

డీసీడీసీ పరిధిలోకి డయాలసిస్ సేవలు



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలోని న్యూట్రీషన్ కిట్ స్టోర్‌రూం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో ఐదేళ్ల క్రితం డయాలసిస్ కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి డీమెడ్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. అయితే, రాష్ట్రవ్యాప్తంగా డయాలసిస్ సేవలను ప్రభుత్వం డీసీడీసీ సంస్థకు కేటాయించటంతో సత్తుపల్లిలోని కేంద్రంలోనూ కొత్తగా ఐదు బెడ్లు, యంత్రాలు, ఇతరత్రా సమకూర్చారు. కాగా, బుధవారం ప్రభుత్వం హెల్త్‌మేళా నిర్వహిస్తుండటంతో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రితో పాటు పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలను మామిడి తోరణాలు, విద్యుత్ లైట్లు, అరటి ఆకులతో అలంకరించారు. అలాగే, గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించనున్నారు.

కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శన కొనసాగుతోంది. ఈమేరకు మంగళవారం పలు కళాశాలల విద్యార్థులు ప్రదర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా 'పుస్తకం-రచయిత' పేరిట ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల బుక్ రీడర్స్ క్లబ్, తెలంగాణ బుక్ ట్రస్ట్, మహిళా కళాశాల బుక్ రీడర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన సదస్సు ఏర్పాటుచేయగా పాఠకులు, విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈకార్యక్రమంలో నేలకొండపల్లి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరంజ్యోతి, అధ్యాపకులు పోట్ల కృష్ణవేణి, పద్మారాణి, డాక్టర్ సీతారంతో పాటు ప్రసేన్ పాల్గొన్నారు.

డీసీసీబీ అక్రమాలపై సీబీసీఐడీ నజర్

- నకిలీ పత్రాలతో మార్ట్‌గేజ్ రుణాల తీసుకున్న వ్యవహారం
- ప్రధాన కార్యాలయంలో రికార్డుల పరిశీలన

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లో మార్ట్‌గేజ్ రుణాల పంపిణీలో జరిగిన అక్రమాలపై సీబీసీఐడీ దృష్టి సారించింది. గత పాలకవర్గం హయాంలో ఖమ్మం నగరంలోని పలు బ్రాంచిల్లో తప్పుడు దస్తావేజులు సమర్పించి 20 మంది రూ.4.50 కోట్ల మార్ట్‌గేజ్ రుణాలు తీసుకున్నారు. ఈ వ్యవహారం 2020వ సంవత్సరంలో బ్యాంకు అధికారుల నడుమ విభేదాల నడుమ బయటపడింది. అదే సమయాన కూరాకుల నాగభూషణం చైర్మన్‌గా నూతన పాలకవర్గం ఎన్నిక కాగా, సీఈఓగా అట్లూరి వీరబాబు నియమితులయ్యారు. మార్ట్‌గేజ్ రుణాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఓ ఏజీఎంతో విచారణ జరిపించారు. ఆతర్వాత ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదు చేశారు. అప్పటి నుంచి అపరిష్కృతంగా ఉన్న కేసులను సీబీసీఐడీకి బదలాయించగా అధికారులు మంగళవారం ఖమ్మం గాంధీచౌక్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చి మార్ట్‌గేజ్ రుణాల వ్యవహారంపై ఆరా తీశారు. అలాగే, రికార్డులు కూడా పరిశీలించారు. మరోపక్క ఇదే వ్యవహారంపై ఇప్పటికే రాష్ట్ర సహకార బ్యాంక్ (టస్కాబ్) విచారణ సాగిస్తోంది. తాజాగా సీబీసీఐడీ రంగంలోకి దిగటంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది.

'ఆరోగ్య మహిళ'కు సర్వర్ సమస్య

- పేర్ల నమోదుకు గంటల తరబడి ఆలస్యం
- మండుటెండలో అవస్థలు పడిన మహిళలు


మంచుకొండ పీహెచ్‌సీలో పరీక్షల కోసం వచ్చిన మహిళలు

రఘునాథపాలెం: నలభై ఏళ్లు పైబడిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేసి నివేదికల ఆధారంగా చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈమేరకు జిల్లాలో ఆరు ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ మంగళవారం పరీక్షలు నిర్వహిస్తుండగా జాబితాలో రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ పీహెచ్‌సీ కూడా ఉంది. తొలుత మహిళలను పరీక్షించాక రక్తనమూనాలు సేకరించేందుకు తెలంగాణ డయాగ్నస్టిక్స్ యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈమేరకు మంగళవారం పరీక్షల కోసం పెద్దసంఖ్యలో మహిళలు రాగా, సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. సాయంత్రం వరకు 10 నుంచి 15 మంది పేర్లు కూడా అప్‌లోడ్ కాకపోవడంతో ఎండలో వేచి ఉండలేక పలువురు వెనుదిరిగారు. ఈ సందర్భంగా పలువురిని పలకరించగా తమ బాధలు ఏకరువు పెట్టారు. పంగిడికి చెందిన జర్పుల శకుంతల మాట్లాడుతూ పనులు ఆపుకుని వస్తే మధ్యాహ్నం వరకు వేచి ఉన్నా యాప్‌లో పేరు నమోదు కాలేదని చెప్పిన సిబ్బంది మరోరోజు రావాలని సూచించారన్నారు. అలాగే, బానోతు బుజ్జి మాట్లాడుతూ ఇరవై కిలోమీటర్ల దూరం నుంచి ఎండలో వస్తే పేరు నమోదు కాక రక్తనమూనాలు తీసుకోలేదని వాపోయారు. ఈవిషయమై పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణ డయాగ్నిస్టిక్ యాప్ సర్వర్ స్లోగా ఉండటంతో పేర్ల నమోదులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెప్పారు. ప్రతీ వారం 80నుంచి వంద మందికి పైగా మహిళలు వస్తుండడంతో పేర్లు నమోదు కాక రక్తపరీక్షలకు నమూనాలు తీసుకోవడం సమస్యగా మారిందని వెల్లడించారు.

పది నిమిషాలు ఉంటే ప్రాణం దక్కేది..

- రైలు నుండి జారి పడి బీహార్ కూలీ మృతి

ఖమ్మంక్రైం: రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం వారిది. బ్రతుకుదెరువు కోసం రాష్ట్రాలు దాటి వస్తున్న కూలీ కాసేపైతే గమ్యస్థానం చేరుకుంటాననగా నిద్రమత్తులో రైలు నుంచి జారి పడడంతో ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు... బీహార్ రాష్ట్రంలోని భోజ్‌పూర్ జిల్లా నార్తి చాందీకి మంజిత్‌కుమార్(18) సూర్యాపేట జిల్లాలో పనికి కుదిరాడు. ఖమ్మంకు చేరుకుని ఇక్కడ నుంచి సూర్యాపేట వెళ్లేందుకు బంధువులతో కలిసి సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. జనరల్ బోగీలో రద్దీగా ఉండడంతో తలుపు వద్ద కూర్చున్న ఆయన పది నిమిషాలైతే రైలు ఖమ్మం చేరుకుంటుందనగా మంగళవారం తెల్లవారుజామున నిద్రమత్తులో దానవాయిగూడెం సమీపాన జారి పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు బంధువులు చైన్ లాగి రైలును ఆపి జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్నం ఫౌండేషన్ బాధ్యుల సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

మధిర: మండలంలోని సైదల్లీపురం కేసీఆర్ కాలనీలో సోమవారం రాత్రి ఒక బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. డాబాపై ఉన్న బాలికపై మాటూరుపేటకు చెందిన ఇద్దరు యువకులు అత్యాచారయత్నానికి పాల్పడడంతో కుటుంబ సభ్యులు గమనించి వారికి దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత నిందితులను పోలీసులకు అప్పగించారు. ఘటనపై మంగళవారం బాధితురాలి తండ్రి చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఇంటర్ మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యాయనే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తిరుమలాయపాలెం మండలం తాళ్ల చెరువుకు చెందిన ఇరుకులపాటి వంశీకృష్ణ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబంతో సహా మోతీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉండగా, కుమార్తె జీవిత(17) ఖమ్మంలో ఇంటర్ చదువుతోంది. మొదటి సంవత్సరంలో 411 మార్కులు వచ్చినప్పటికీ గణితంలో ఫెయిల్ అయింది. దీంతో సప్లిమెంటరీ ఫీజు కట్టినప్పటికీ బాధపడుతున్న ఆమె మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బయటకు వెళ్లిన కుటుంబీకులు వచ్చేసరికి వేలాడుతుండడంతో కన్నీరుమున్నీరుగా రోదించారు.

జిలెటిన్‌స్టిక్స్ సరఫరా చేస్తున్న నలుగురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మణుగూరు డీఎస్పీ

అశ్వాపురం: అడవుల్లో కూంబింగ్ చేసే పోలీసులే లక్ష్యంగా మందుపాతరలు పెట్టే మావోయిస్టులకు జిలెటిన్ స్టిక్స్, కార్డెక్స్ వైరు సరఫరా చేస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మణుగూరు డీఎస్పీ ఈ మేరకు మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఆదేశాల మేరకు చర్ల, అశ్వాపురం మండలాలకు చెందిన ఇర్పా రామారావు, కొమరం అర్జున్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, కన్నెబోయిన వెంకటేశ్వర్లు ఎనిమిది జిలెటిన్ స్టిక్స్, 50 మీటర్ల కార్డెక్స్ వైరు సరఫరా చేస్తూ.. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనుల వద్ద సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. వారిని విచారించగా మావోయిస్టులకు సరఫరా చేస్తున్నామని అంగీకరించారు. నలుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇర్పా రామారావు గతంలో నాలుగు కేసుల్లో నిందితుడని, ఫిబ్రవరి మొదటి వారంలో ఎర్రబోరు–బోధనెల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై 20 కేజీల మందుపాతర అమర్చి పోలీసులను చంపేందుకు యత్నించిన కేసులోనూ అతడు నిందితుడని చెప్పారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

గురుకుల కొలువుల

దరఖాస్తులో సవరణకు అవకాశం

- పోస్టుల వారీగా సవరణకు తేదీలను ప్రకటించిన టీఆర్‌ఈఐఆర్‌బీ
- సవరణకు అవకాశం ఒక్కసారి మాత్రమేనని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్‌: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల్లో వివరాల సవరణకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) అవకాశం కల్పించింది. ఐదు గురుకుల సొసైటీల పరిధిలో 9 వేలకు పైబడి ఉద్యోగాలకుగాను టీఆర్‌ఈఐఆర్‌బీ గత నెల 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. అయితే అభ్యర్థులు సమర్పించిన ఆన్‌లైన్‌ దరఖాస్తుల్లో అక్కడక్కడా తప్పులు దొర్లడంతో పాటు వన్‌ టైమ్‌ రిజిస్ట్రేషన్‌(ఓటీఆర్‌) సమయంలోనూ పొరపాట్లు జరిగినట్లు టీఆర్‌ఈఐఆర్‌బీకి పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. దీంతో దరఖాస్తులో సవరణకు అవకాశం కల్పించింది. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పోస్టు కేటగిరీ వారీగా సవరణ తేదీలను అందులో పేర్కొంది. సగటున ఒక్కో పోస్టుకు సంబంధించిన దరఖాస్తు సవరణకు 5 రోజుల గడువు ఇచ్చింది.

ఎడిట్‌ అవకాశం ఒక్కసారే...

గురుకుల కొలువుల దరఖాస్తు సవరణకు ఒక్కసారి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు స్పష్టం చేసింది. ఒకసారి సవరణ చేసుకున్న అభ్యర్థికి మరోసారి సవరణకు అవకాశం ఉండదని వివరించింది. ఇప్పటికే ప్రింట్‌ తీసుకున్న దరఖాస్తు ఫారాన్ని పరిశీలించి పొరపాట్లు ఎక్కడ దొర్లాయో గుర్తించి ఆమేరకు సవరణ చేసుకోవాల్సి ఉంటుంది. సవరణ చేసుకునే అభ్యర్థి ముందుగా గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో లాగిన్‌ కావాల్సి ఉంటుంది. ఉన్నత విద్యకు సంబంధించిన వివరాలు, సొసైటీ ప్రిఫరెన్సెస్‌, ఎగ్జామ్‌ సెంటర్‌ ప్రిఫరెన్స్‌ తదితర వివరాల సవరణకు అప్లికేషన్‌ కరెక్షన్‌ టాబ్‌ ద్వారా ఎడిట్‌ చేసుకోవాలి. అభ్యర్థి బేసిక్‌ డీటైల్స్‌, ఇతర వివరాలు, చిరునామా, ఫొటో, సంతకం, తదితరాల సవరణ, అప్‌డేషన్‌కు మాడిఫై వన్‌టైమ్‌ రిజిస్ట్రేషన్‌ దగ్గర క్లిక్‌ చేయాలి. సవరణ తర్వాత పీడీఎఫ్‌ దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్‌ చేసుకుని ప్రింట్‌ తీసుకోవాలి.

పోస్టు కేటగిరీల వారీగా సవరణ తేదీలు

- జూనియర్‌ కాలేజీల్లో జూనియర్‌ లెక్చరర్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌, లైబ్రేరియన్‌ పోస్టులతో పాటు స్కూళ్లలో పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ టీచర్‌(పీజీటీ) : ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు.
- డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌, లైబ్రేరియన్‌, పాఠశాలల్లో లైబ్రేరియన్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌, డ్రాయింగ్‌/ఆర్ట్‌ టీచర్‌, క్రాఫ్ట్‌ ఇన్‌స్ట్రక్టర్‌/క్రాఫ్ట్‌ టీచర్‌, మ్యూజిక్‌ టీచర్‌ : ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు
- ట్రైన్డ్‌ గ్రాడ్యుయేట్‌ టీచర్‌(టీజీటీ): 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు

మీ చిరునవ్వుల్లో సకల సంతోషాలు

ఈ ప్రభుత్వం మీదే.. ఉద్యోగికి మంచి చేయాలన్నదే నా తపన: ఏపీ సీఎం జగన్‌

కేబినెట్‌ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ ఏపీ సీఎంను కలసిన ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందని, తద్వారా ప్రజలు సంతోషంగా ఉంటారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కొందరు రాజకీయ కారణాలతో చెప్పే అంశాలను ఉద్యోగులు విశ్వసించనక్కరలేదని, నా మనసు ఎప్పుడూ మీకు మంచి చేయడం కోసమే ఉంటుందని, అన్నింటినీ పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్‌ సమావేశంలో కొత్తగా జీపీఎస్‌ తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న పలు నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాయి.



ఏపీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఈమేరకు ఏపీ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశమయ్యారు. ''ఉద్యోగులను సంతోషంగా ఉంచేందుకు నా తరఫు నుంచి ప్రతి కార్యక్రమాన్ని మనసా, వాచా, కర్మణా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నా. ఈ విషయాన్ని ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నా..'' అని ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం జగన్‌ అన్నారు.

మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని రాష్ట్ర సీఎం వైఎస్‌ జగన్‌కి తెలియజేశామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్‌ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్‌, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం జగన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు. 47 అంశాలపై సీఎస్‌కు తాము లేఖ ఇస్తే 36 అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపామని చెప్పారు. సోషల్‌ మీడియాలో ఉద్యోగ సంఘాలపై పలువురు వ్యతిరేకంగా పలు రకాల చర్చ నడుపుతున్నారని, ప్రభుత్వానికి ఉద్యోగులను దూరం చేసేందుకే పలు రాజకీయ పార్టీలు ఈ చర్చ నడుపుతున్నాయని తెలిపారు.



ఓబీసీ మహాసంఘ్‌ మెగా కన్వెన్షన్‌కు ఏపీ సీఎంకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్‌ ప్రతినిధులు మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ను కలిశారు. ఆగస్టు 7న తిరుపతిలోని ఎస్వీ స్టేడియంలో నిర్వహించనున్న 8వ జాతీయ మెగా కన్వెన్షన్‌లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. సీఎం జగన్‌ను కలిసిన వారిలో ఆలిండియా బ్యాక్‌వర్డ్‌ క్లాస్‌ ఫెడరేషన్‌ ప్రెసిడెంట్‌ జస్టిస్‌ వి.ఈశ్వరయ్య, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్‌ నాయకులు డాక్టర్‌ బాబారావు తైవాడే, సచిన్‌ రాజుర్కర్‌, జాజుల శ్రీనివాస్‌గౌడ్‌, కేశన శంకరరావుతో పాటు మంత్రి జోగి రమేశ్‌ కూడా ఉన్నారు. అనంతరం జస్టిస్‌ వి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించే సభకు ఆహ్వానించగా.. సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు బిల్లుపెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు.

ఎంపీ అవినాశ్‌ జైలు పాలే మీ లక్ష్యమా?

- సునీతకు సుప్రీంకోర్టు ప్రశ్న
- ఎందుకీ ఈగో క్లాషెస్‌?
- ప్రతివాది మీ కజినే కదా?
- అంత అత్యవసరం ఏముంది? వెకేషన్‌ బెంచ్‌కు ఎందుకు?
- ఇప్పుడీ పిటిషన్‌ను కొట్టివేస్తే సీనియర్‌ న్యాయవాదికి ఇబ్బందే
- సీబీఐకి నోటీసులివ్వలేం.. విచారణ 19కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్‌ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని జైలుపాలు చేయడమే మీ లక్ష్యమా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం నర్రెడ్డి సునీతను ప్రశ్నించింది. ఈ వ్యవహారం చూస్తుంటే ఈగో క్లాషెస్‌లా ఉందని వ్యాఖ్యానించింది. తొందరపడి వ్యక్తిగత వాదనల ద్వారా నష్టపోతారేమో చూసుకోవాలని హితవు పలికింది. పిటిషనర్‌ సునీత విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ అదనపు డాక్యుమెంట్లు అందచేసేందుకు అనుమతించింది. ఎంపీ వైఎస్‌ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ విక్రమ్‌నాథ్‌, జస్టిస్‌ అహ్సనుద్దీన్‌ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. అయితే సుప్రీం వెకేషన్‌ బెంచ్‌ సీనియర్‌ న్యాయవాదులను అనుమతించకపోవడంతో పిటిషనర్‌ సునీత తన వాదనలు తానే వినిపించడం ప్రారంభించారు. సీనియర్‌ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆమెకు సహకరించేందుకు ధర్మాసనం అనుమతించింది. తాను పిటిషనర్‌నని, తన తండ్రి హత్యకు గురయ్యారని సునీత చెబుతుండగా.. ఆ విషయాల్లోకి తాము వెళ్లడం లేదని, వెకేషన్‌లో ఎందుకు వచ్చారని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ కేసులో జూన్‌ 30 కల్లా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఛార్జిషీట్‌ ముందే ఫైల్‌ చేయాల్సి ఉంది. ఏ – 8 (అవినాశ్‌) భారీ కుట్ర చేసిన ప్రధాన వ్యక్తుల్లో ఒకరు. సీబీఐ దర్యాప్తునకు సహకరించడంలేదు. ముందస్తు బెయిలు పొందడం వల్ల కస్టోడియల్‌ ఇంటరాగేషన్‌ కుదరడం లేదు. ముందస్తు బెయిలు ఎందుకు ఇచ్చారో కారణాలు తెలియడం లేదు'' అని సునీత పేర్కొన్నారు. ఈ సమయంలో జస్టిస్‌ విక్రమ్‌నాథ్‌ జోక్యం చేసుకుంటూ 'దీంట్లో అంతగా అత్యవసరమైన పరిస్థితి ఏముంది? వెకేషన్‌ బెంచ్‌కు రావాల్సిన అవసరం ఉందా?' అని ప్రశ్నించారు.

సీబీఐ చూసుకుంటుంది..

'ఒక వ్యక్తిని అరెస్టు చేయాలో లేదో దర్యాప్తు సంస్థ చూసుకుంటుంది. ఎవరిని, ఎప్పుడు అరెస్టు చేయాలో ఎవరిని కస్టోడియల్‌ ఇంటరాగేషన్‌ చేయాలో సీబీఐకు తెలుసు. విచారణకు సహకరిస్తున్నారా లేదా అనేది కూడా సీబీఐ చూసుకుంటుంది. మీరెందుకు జోక్యం చేసుకుంటారు? ఈ కేసులో పలు సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. మీకెందుకు ఈగో క్లాషెస్‌? అతడిని (ఎంపీ అవినాశ్‌) జైలుపాలు చేయాలన్న లక్ష్యమా? ఆవిధంగా చూడొద్దు. ఈ తరహా ప్రొసీడింగ్స్‌ ఎందుకు?'' అని జస్టిస్‌ అమానుల్లా వ్యాఖ్యానించారు.



ఇప్పుడీ పిటిషన్‌ను కొట్టివేస్తే..

ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇతర నిందితులతో కలసి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత ఆరోపించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అవినాశ్‌రెడ్డి సీబీఐ దర్యాప్తునకు సహకరిస్తున్నప్పుడు కస్టోడియల్‌ ఇంటరాగేషన్‌ అవసరం ఏముందని ప్రశ్నించింది. ''మీకో సలహా ఇస్తాం. మీరు వ్యక్తిగతంగా వాదిస్తున్నారు. చట్టంపై అవగాహన లేమితో వాదనలో అంతగా ప్రావీణ్యం లేకపోవచ్చు. మేం ఇప్పుడు ఈ పిటిషన్‌ను కొట్టివేస్తే సీనియర్‌ న్యాయవాదికి ఇబ్బంది అవుతుంది. అందుకే సెలవుల తర్వాత విచారణ జాబితాలోకి చేరుస్తాం'' అని సునీతనుద్దేశించి ధర్మాసనం పేర్కొంది. సీబీఐ దర్యాప్తు ఈ నెల 30 కల్లా పూర్తి కావాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని సీనియర్‌ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ సమయంలో పేర్కొన్నారు. వాదనలకు సీనియర్‌ న్యాయవాదులను అనుమతించడం లేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ తమకు ఇబ్బంది కలగ చేయవద్దని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. తాము ఇప్పుడు వాదనలకు అనుమతిస్తే మరో నలుగురు సీనియర్‌ న్యాయవాదులు తమను విమర్శకు గురి చేశారని ఆరోపించే అవకాశం ఉందని పేర్కొంది. తాము అనుమతించకపోయినప్పటికీ మీరు వాదనలు చేస్తున్నారంటూ లూథ్రాను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో మరో బెంచ్‌ నిర్దేశించిన డెడ్‌లైన్‌ను తాము మార్చలేమని స్పష్టం చేసింది.

గడువు నిర్దేశించాక ఎలా మారుస్తాం?

సీబీఐకు నోటీసులిచ్చి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించాలని ధర్మాసనాన్ని సునీత కోరారు. అయితే ఇప్పటికే మరో బెంచ్‌ జూన్‌ 30వ తేదీ అని గడువు నిర్దేశించిన తరువాత తాము ఎలా మారుస్తామని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ ఇప్పుడు తాము జోక్యం చేసుకుంటే మొత్తం అంతా మారిపోతుందని వ్యాఖ్యానించింది. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వాలని సునీత మరోసారి అభ్యర్థించడంతో ధర్మాసనం స్పందిస్తూ.. ''ఎందుకు సీబీఐ రావాలని కోరుతున్నారు? రావాలో వద్దో సీబీఐ నిర్ణయించుకుంటుంది. ప్రతివాది సహకరించకుంటే, కస్టోడియల్‌ ఇంటరాగేషన్‌ అవసరమైతే, హైకోర్టు ఆదేశాలు సరికాకుంటే సీబీఐ తనకు తానే వస్తుంది. అందుకే చెబుతున్నాం. జూలై 3న కోర్టుకు రండి. మీ న్యాయవాది వాదిస్తారు' అని ధర్మాసనం సూచించింది.

న్యాయవాది వాదించడమే సబబు..

హైకోర్టు ఆదేశాలు నిష్ప్రయోజనమని ఈ అంశానికి సంబంధించి మరో కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సునీత పేర్కొనడంతో అందుకే తాము సెలవుల తర్వాత రావాలని సలహా ఇస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ప్రతివాది అవినాశ్‌ మీ కజినా? అని ధర్మాసనం పదేపదే సునీతను ప్రశ్నించగా... అవునని తన రెండో కజిన్‌ అని సునీత సమాధానమిచ్చారు. అయితే పిటిషనర్‌ తరఫున న్యాయవాది వాదించడమే సబబని, ఇందులో సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా సునీత పిటిషన్‌ను బుధవారం విచారణ జాబితాలో చేర్చాలని, అడ్వొకేట్‌ ఆన్‌రికార్డ్స్‌ హాజరవుతారని లూథ్రా న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వడంలో తాము జోక్యం చేసుకోబోమని, పిటిషనర్‌ విజ్ఞప్తి మేరకు ఈ నెల 19న విచారణ జాబితాలో చేర్చాలంటూ రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

జిల్లా వార్తలు

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఖమ్మంమయూరిసెంటర్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో ఇంటర్‌(జనరల్‌, ఒకేషనల్‌) కోర్సుల్లో చేరేందుకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. ఇంటర్‌ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్‌ కోర్సుల్లో చేరేందుకు 2023 మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయ సంస్థ వెబ్‌సైట్‌ ద్వారా రూ.100 చెల్లించి ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

సింగరేణిలో అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం



సింగరేణి(కొత్తగూడెం): ఐటీఐ వివిధ ట్రేడ్లలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సింగరేణిలో ఏడాదికి కాలానికి గాను అప్రెంటిష్‌ షిప్‌ దరఖాస్తు చేసుకోవాలని జీఎం పర్సనల్‌ (వెల్ఫేర్‌ అండ్‌ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. సింగరేణి ఉద్యోగులు, ఉద్యోగుల పిల్లలు, నిర్వాసిత కుటుంబాల్లో పిల్లలతో పాటు ఇతరులకు అవకాశముందని తెలిపారు. జనరల్‌ కేటగిరీ అభ్యర్థులైతే 18నుంచి 28 ఏళ్ల వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌ అభ్యర్థులైతే 30-05-1995 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు WWW.apprenticeshipindia.org లో రిజిస్ట్రేషన్‌ చేసుకున్నాక సింగరేణి వెబ్‌సైట్‌లో ఈనెల 14 నుండి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో WWW.apprenticeship.gov.in రిజిస్టర్‌ అయిన వారు కొత్త వైబ్‌సైట్‌ WWW.apprenticeshipindia.org లోకి మారాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా సమీప ఎంవీటీసీ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌ అందజేస్తున్న ఏడీ శ్రీనివాసాచారి

మరింత చేదుగా కాకర!

- వీడని చీడపీడలు.. వెంటాడుతున్న కరెంటు కష్టాలు
- ఎండిపోతున్న తోటలను వదిలేస్తున్న రైతులు
- ఫలితంగా గతేడాదికంటే తగ్గిన సాగు విస్తీర్ణం





నీరందక వదలిపోతున్న కాకర తోట (ఇన్‌సెట్‌) చీడపీడలతో ఎండిపోతున్న బీరతీగ

ఇల్లెందురూరల్‌: మండు వేసవిలో భానుడి సెగలను తట్టుకుంటూ దుక్కులు సిద్ధం చేసి కాకర సాగు ప్రారంభించిన రైతులు చివరకు పెట్టుబడి కూడా దక్కని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏటా పంటకు సోకుతున్న చీడపీడలు, భారంగా మారుతున్న పెట్టుబడి, గిట్టుబాటు ధర దక్కకుండా మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం వెరసి కాకర రైతులు నష్టాల బాటలో పయనిస్తున్నారు. గత అనుభవాలను గుర్తించిన రైతులు ఈ ఏడాది చాలామంది కాకర సాగుకు దూరంగా ఉండిపోయారు. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీనికి తోడు కొద్దోగొప్పో సాగు చేసిన తోటలకు ప్రస్తుత సీజన్‌లో ఎదురవుతున్న కరెంటు కష్టాలు మరింత ఇబ్బంది పెడుతుండటంతో చేసేదేం లేక తోటలను మధ్యలోనే వదిలేస్తున్నారు.

మండుటెండలో..

సాధారణంగా ఏ పంట అయినా తొలకరి జల్లు కురిసిన వెంటనే సాగు ప్రారంభిస్తారు. కానీ కాకర సాగు ఏప్రిల్‌ చివరి వారం నుంచే మొదలవుతుంది. దుక్కులు సిద్ధం చేయడంతోపాటు విత్తనాలు విత్తుకోవడం, మొలకను బతికించుకునేందుకు నీటి తడులు వంటి పనులన్నీ మండుటెండలో చేయాల్సిందే. ఉమ్మడి జిల్లాలో కాకరసాగు అత్యధిక విస్తీర్ణం ఇల్లెందు మండలంలోనే ఉంటుంది. ఈ మండలంలో ఏటా సుమారు 300 నుంచి 350 ఎకరాల విస్తీర్ణంలో కాకర వేస్తుండగా.. ఈసారి మాత్రం సుమారు 200 ఎకరాలకు మించలేదని చెబుతున్నారు.

చీడపీడలతో ఆగమాగం

ఎకరం విస్తీర్ణంలో వేసే విత్తనాలకు రూ.15 వేలు, కర్రలతో పందిరి ఏర్పాటు, బైండింగ్‌ వైర్‌, ప్లాస్టిక్‌ వైర్‌, దుక్కులు సిద్ధం చేయడం తదితరాల ఖర్చు సుమారు రూ.20 వేలు ఉంటుంది. వీటితోపాటు పురుగు మందులు, పంట కోయడం ఖర్చు రూ.30 వేల వరకు వస్తుంది. ఎలాంటి తెగుళ్లు ఆశించకపోతే పెట్టుబడి వ్యయం రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంటుంది. కానీ, మూడేళ్లుగా కాకర పంటను ఆశిస్తున్న చీడపీడలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది బుగ్గతెగులు, నల్లితెగులు ఆశించడంతో తోటలు వడలిపోతున్నాయని, ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు.

విడతల వారీగా కరెంట్‌

పంటను ఆశించే తెగుళ్ల కంటే కరెంట్‌ కష్టాలు అన్నదాతలను కుంగదీస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో నీటితడులు ఎక్కువగా అవసరమవుతుండటంతో విద్యుత్‌ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు చేలవద్దే కాపలా ఉంటున్నారు. ఇచ్చే కాస్త కరెంట్‌ కూడా విడతల వారీగా ఇస్తుండడంతో నీటి తడి అందించడం సాధ్యం కావడం లేదు. ఇవన్నీ పక్కన పెడితే గట్టిగా వడగాలి వీచినా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తుండడం గమనార్హం. ప్రధానంగా ఇల్లెందు మండలం పోలారం ఫీడర్‌ పరిధిలో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలా రకరకాల కారణాలతో సకాలంలో నీరందక సుమారు కాకర తోటలను రైతులు అలాగే వదిలేశారు. కొంత మంది మాత్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

ప్రస్తుతం ఏజెన్సీలో మెరుగైన రీతిలో విద్యుత్‌ సరఫరా చేస్తున్నాం. పోలారం ఫీడర్‌ పరిధిలో మాత్రమే కొంత సమస్య ఎదురవుతోంది. దీనిని కూడా అధిగమించేందుకు నిరంతరం మా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ కారణంగానే పోలారం కేంద్రంగా సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించుకున్నాం.

–రవి, ట్రాన్స్‌కో ఏఈ, ఇల్లెందు మండలం

నీరు లేక చేను వదిలేశా..



నేను అర ఎకరం విస్తీర్ణంలో కాకర సాగు చేశా. ప్రస్తుతం తోగ దశకు చేరుకుంది. పది రోజులుగా మూడు, నాలుగు గంటలు కూడా కరెంట్‌ రావడంలేదు. దీంతో నీరు అందక తోట ఎండిపోయింది. ఇలాగే చాలా మంది రైతుల తోటలు పూర్తిగా ఎండిపోయాయి.

–వాంకుడోత్‌ శ్రీను, రైతు, పోచారంతండా, ఇల్లెందు మండలం

చీడపీడలతో ఇబ్బంది పడుతున్నాం



మండుటెండలో ధైర్యం చేసి కాకర, బీర సాగు చేపట్టా. ఓ వైపు కరెంట్‌ కష్టాలు వేధిస్తున్న తరుణాన పంటలను ఆశిస్తున్న తెగుళ్లు మరీ కుంగదీస్తున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. సలహాలు ఇవ్వాల్సిన అధికారులెవరూ మావైపు చూడటం లేదు.

–మంచె రమేశ్‌, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

పేదలకు అండగా ఎంపీ నామా



చెక్కులు అందుకున్న వారితో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్‌: ఆపదలో ఉన్న పేదలకు ఎంపీ నామా నాగేశ్వరరావు అండగా నిలుస్తున్నారని పలువురు నాయకులు వెల్లడించారు. ఎంపీ సిఫారసుతో ఖమ్మం, మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, డోర్నకల్‌, ఇల్లెందు నియోజకవర్గాలకు చెందిన 41 మందికి మంజూరైన రూ.16.02 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఖమ్మంలోని క్యాంప్‌ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎవరు ఆపదలో ఉన్నా పార్టీలకతీతంగా ఎంపీ సాయం చేస్తున్నారని తెలిపారు. నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్‌, చింతలచెర్వు లక్ష్మి, చావా వేణు, వీరవెల్లి వెంకటేశ్వర్లు, తిప్పని అలివేలమ్మ, అంబేద్కర్‌, తన్నీరు రవికుమార్‌, వాకదాని కోటేశ్వరరావు, గొడ్డేటి మాధవరావు, తాళ్లూరి హరీశ్‌, పాల్వంచ రాజేశ్‌, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యంతో సాగుకు దూరం

రాష్ట్రస్థాయి సదస్సులో జూలకంటి, పోతినేని



మాట్లాడుతున్న రంగారెడ్డి

అశ్వారావుపేట: అత్యధిక సాగు యోగ్యత కలిగి ఉన్న సారవంతమైన భూములు దేశంలోనే ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో రైతులు సాగుకు దూరమవుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌ అన్నారు. అశ్వారావుపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పామాయిల్‌ సాగు విస్తరణకు బడ్జెట్‌ కేటాయించినా ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. గిట్టుబాటు ధర రావాలంటే రైతుల ఐక్యంగా ఉండాలన్నారు. కాగా, ఆయిల్‌ఫెడ్‌కు ప్రైవేట్‌ కంపెనీల రూపంలో ప్రైవేటీకరణ ప్రమాదం పొంచి ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గెలల గిట్టుబాటు ధర రూ.13,456గా కేంద్రంతో రాష్ట్రాలు ఒప్పందం చేసుకోవాలనడం ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఈ సమావేశంలో కొక్కెరపాటి పుల్లయ్య, కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, మాదినేని రమేశ్‌, బొంతు రాంబాబు, తుంబూరు మహేశ్వర్‌రెడ్డి, చలపతిరావు, తలశిల ప్రసాద్‌, అన్నవరపు సత్యనారాయణ, శివరాం పాల్గొన్నారు.

ఎక్కడికెళ్లినా వెంటే కరెంట్‌!



మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన సంచార జీవులు రఘునాథపాలెం మండలం ఇల్లెందు రోడ్డులోని నాగమ్మ దేవాలయం వెనుక గుడారాలు వేసుకుని ఉంటున్నారు. వీరు ఎక్కడికి వెళ్లినా 20 నుంచి 25 రోజులు పాటు ఉండి మూలికలు విక్రయిస్తుంటారు. వాహనాల్లో వస్తున్న వీరు లైట్లు, ఫ్యాన్లు నడిచేలా సోలార్‌ ప్యానళ్లకు తీసుకొచ్చారు. ఎక్కడా కరెంట్‌ కోసం చూడకుండా సోలార్‌ ప్యానళ్ల ద్వారా వచ్చే విద్యుత్‌ను వినియోగిస్తామని తెలిపారు. – స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, ఖమ్మం

బలోపేతమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని చేపట్టిందని విద్యాశాఖ అడిషనల్‌ డైరెక్టర్‌ సున్నం శ్రీనివాసాచారి తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా జూలూరుపాడులోని పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్‌ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధన, లైబ్రరీ, బోధన సామగ్రిని పరిశీలించాక తొలిమెట్టు, మధ్యాహ్న భోజనాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో 4వ తరగతి చదివిన విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించడంతో అభినందించారు. అలాగే, విద్యార్థులకు యూనిఫామ్‌, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఎంఈఓ గుగులోత్‌ వెంకట్‌, హెచ్‌ఎం వాకపల్లి గీత, ఉపాధ్యాయులు డి.భాస్కర్‌, సీతారాములు, స్వర్ణ, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.